చంద్రబాబు, లోకేశ్‌ను అరెస్ట్ చేయాలి

- రూ.118 కోట్ల స్కాంలో అరెస్ట్ తప్పదు
- హింసా రాజకీయాలు రాష్ట్రానికి చేటు
- టీడీపీ కార్యకర్తల ముసుగులో ఉన్న రౌడీ షీటర్లు, గూండాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: అధికారం కోసం యాత్రల పేరుతో అల్లర్లు సృష్టించి, కులమతాలను రెచ్చగొట్టి, రాష్ట్రాన్ని తగులబెట్టాలని చూస్తున్న తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్‌లను తక్షణం అరెస్ట్ చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్ యాత్రలలో పాల్గొంటున్న, ఆ పార్టీ కార్యకర్తల ముసుగులో ఉన్న రౌడీ షీటర్లు, గూండాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. పుంగనూరు, భీమవరం యాత్రలలో జరిగిన సంఘటనలు వారు చేస్తున్న కుట్రలకు నిదర్శనమన్నారు. హింసను ప్రేరేపిస్తూ, దాడులకు తన పచ్చగ్యాంగ్‌ను ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికలలో గెలవలేమని తెలుసుకుని, సర్వేలు సైతం ఇదే చెబుతుండగా ఒత్తిడికి గురవుతూ, మతి భ్రమించిన చంద్రబాబు, లోకేశ్ కవ్వింపు చర్యలకు, శవ రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు వీధి రౌడీ మాదిరి ప్రవర్తిస్తూ రెచ్చగొడుతుండగా, సీఎం, మంత్రులను బూతులు తిడుతున్నాడన్నారు. లోకేశ్ ఎన్ని ఎక్కువ కేసులుంటే అంత పెద్ద నామినేటెడ్ పదవి ఇస్తానంటూ తన పార్టీ కార్యకర్తలను దాడులకు ఉసిగొల్పుతున్నారని, పక్కా ప్లాన్‌తో పుంగనూరు, భీమవరంలో హింసను ప్రేరేపించి, శాంతి భద్రతల పర్యవేక్షణకు కృషి చేస్తున్న పోలీసుల రక్తం సైతం కళ్లజూశారన్నారు. హింసతో రాజ్యాధికారం కలగానే మిగిలిపోతుందని టీడీపీ అధినేతలు గుర్తించాలని హితవు పలికారు. తమ పార్టీ ఫ్లెక్సీలపై రాళ్లు రువ్వుతూ చించేస్తున్నా, భీమవరం గునుపూడి శివారులో తమ పార్టీ వారిపై దాడులకు పాల్పడుతున్నా, ముగ్గురు పోలీసులు గాయపడేలా చేసినా, పుంగనూరులో కానిస్టేబుల్ కన్ను పోయేలా, మరో 40 మంది పోలీసులు గాయపడేలా బరితెగించినా, ఇటీవల చంద్రబాబుకు ఐటీ నోటీసులు ఇవ్వడంపైనా దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు నోరు మెదపకపోవడం దారుణం అని, ఇంత జరిగినా సొంత పార్టీ వారే దెబ్బతిన్నట్లు పచ్చ మీడియా దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఐటీ నోటీసులతో చంద్రబాబు అరెస్ట్ ఖాయమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రోనున్న రోజుల్లో టీడీపీని భూస్థాపితం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ మాలిక్‌బాష, సర్పంచ్ ముత్యాల శైలజ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు జైలుకెళ్లడం ఖాయం


ఆలూరులో మాట్లాడుతున్న గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి

ఆలూరు రూరల్: అధికారంలో ఉండగా రూ.118.98 కోట్లు అవినీతికి పాల్పడి ఇటీవల ఐటీ శాఖ నుంచి నోటీసులు అందుకున్న మాజీ సీఎం చంద్రబాబునాయుడు జైలుకెళ్లడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి అన్నారు. శుక్రవారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు భవిష్యత్తు గ్యారంటీ పేరుతో చంద్రబాబు, యువగళం పేరుతో లోకేష్ యాత్రలు చేపట్టి టీడీపీ గూండాల ద్వారా రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రూ.600 కోట్ల పనుల్లో చంద్రబాబు తన పీఏ ద్వారా కాంట్రాక్టర్ల నుంచి రూ.118.98 కోట్లు నగదు తీసుకొని, చేసిన అవినీతి బయటపడడంతో మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. పుంగనూరు, భీమవరంలో దాడులు చేయించారని, రాష్ట్రంలో వి.ధ్వంసకాండ సృష్టించి నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నారని చెప్పారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాంభీం నాయుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, ఆలూరు ఎంపీపీ రంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీరాములు, సర్పంచ్‌లు, దేవిరెడ్డి, వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉరుకుంద, నాయకులు మాధన్న, లక్ష్మిరెడ్డి, రామాంజినేయులు, దర్గప్ప, వీరేష్, హనుమప్ప తదితరులు ఉన్నారు.

అవినీతి బాబుకు శిక్ష తప్పదు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అవినీతిలో దిట్ట అయిన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు జైలుకెళ్లక తప్పదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2011–2019 మధ్య జరిగిన అవినీతిపై ఐటీ శాఖ సమగ్ర దర్యాప్తు తర్వాత రూ.118 కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు గుర్తించి చంద్రబాబుకు నోటీసులు ఇచ్చిందన్నారు. షాపూర్జీ పల్లొంజి, ఎల్అండ్‌టీ కంపెనీల ద్వారా అవినీతి డబ్బును చంద్రబాబు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. 2018 డిసెంబర్ నాటికి రూ.8 వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను షాపూర్జీ పల్లోంజికి అప్పగించి లాబీయింగ్ నడిపారని, 2019లో రూ.700 కోట్ల విలువైన పనులు అప్పగించి కమీషన్లు దండుకున్నాడని ఆరోపించారు. కోట్లాది రూపాయల అవినీతిలో చంద్రబాబు, లోకేష్ ఎల్లో మీడియా అధిపతులు, దత్త పుత్రుడు అంతా నోరు మూసుకున్నారన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారు తమ ఏజెంట్ల ద్వారా బీజేపీ చెంతకు చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. తప్పు చేసిన బాబు శిక్ష అనుభవించక తప్పదన్నారు. ఎంపీపీ కేశన్న, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిశుభ్రతపై దృష్టి సారించండి

మద్దికెర: పంచాయతీ అధికారులు మండలంలోని గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల వల్ల సీజన ల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, సత్వ రమే డ్రైనేజీ శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల లో పర్యటించి వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, సీహెచ్ఓ నిరంజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో కొత్త గా మంజూరైన పింఛన్లను శుక్రవారం పంచా యతీ కార్యదర్శి పద్మావతితో కలిసి సచివాయ ల కన్వీనర్ గుంత రఘు పంపిణీ చేశారు. గ్రామంలో కొత్తగా 13 పింఛన్లు మంజూరైనట్లు వారు తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బలిజ ఆనంద్‌పై గురువారం రాత్రి అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. గత నెల 11వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లోకి బలిజ ఆనంద్ ప్రవేశించి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా కేకలు వేయగా ఇరుగువారు వస్తుండడంతో అక్కడినుంచి పరారయ్యాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే అంతు చూస్తానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ విద్యాలయం పరమాన్‌దొడ్డి క్రాస్ వద్ద, సోగనూరు రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణంలోని మైనార్టీ కాలనీకి చెందిన దంపతులు దాదాపీర్, షమీనా ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద హోటల్ నిర్వహిస్తున్నారు. ఎమ్మిగనూరు నుంచి పెద్దకడబూరు మీదుగా ఉరుకుందకు బైక్‌పై వెళ్తుండగా పరమాన్‌దొడ్డి క్రాస్ వద్ద కుక్క అడ్డురావటంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. వారిని పోలీస్ రోడ్ సెఫ్టీ వాహనంలో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే సోగనూరు గ్రామానికి చెందిన ఏలీయా బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలో గొర్రెలు అడ్డురావటంతో అదుపు తప్పి కిందపడిపోవటంతో తలకు గాయం కాగా, కుడి భుజం వద్ద ఎముక విరిగింది. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

50 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తి

దేవనకొండ: ఇప్పటివరకు 50 వేల ఎకరాల్లో పంటల నమోదు పూర్తయ్యిందని ఏఓ సురేష్ బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మీటింగ్ చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలో ఖరీఫ్ పంటల సాగు 75 వేలు ఎకరాలు ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు పంటల నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. అలాగే సభ్యులు మాట్లాడుతూ వాతావరణ బీమాను మండల యూనిట్‌గా కాకుండా గ్రామస్థాయి యూనిట్‌గా అయితే రైతులకు ఉపయోగపడుతుందని తెలియజేశారు సభ్యులు మల్లికార్జున, కందనాతి రంగన్న, ఏఈఓలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి

దేవనకొండ: ఓటరు జాబితాలో పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బీఎల్ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, అలాగే రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారిని గుర్తించి తొలగించాలని, ఓటుహక్కు అడ్రస్‌లు మార్చుకునేందుకు వీలు కల్పించాలన్నారు. ఓటుహక్కు విలువ గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఓటుహక్కు నమోదులో ఏదైనా పొరపాటు జరిగితే దానికి పూర్తి బాధ్యత బీఎల్ఓలదేనని చెప్పారు. ఆర్ఐ సూర్యనారాయణరెడ్డి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు అందిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లను రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆలూరు ఏడీఏ సునీత అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో సీహెచ్‌సీ గ్రూపు సభ్యులు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు తీసుకునే యంత్రాన్ని బట్టి 50 శాతం సబ్సిడీ రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ యంత్రాల ద్వారా కందులు, వేరుశనగ, కొర్రల నుంచి నూనెను తీయవచ్చన్నారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాలల్లో 7 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. ఆలూరు ఏఓ వెంకటేశ్వర గౌడ్, వెక్నికల్ ఏఓ దేవభూషణ్ తదితరులు ఉన్నారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయండి


నాగలదిన్నెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

నందవరం: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు విస్తృత సేవలు అందించాలని ఆదోని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని, గ్రామ సచివాలయం-2, నాగలదిన్నె సచివాలయం-1,-2లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చెంతకు సేవలు అందించేందుకు ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. సమయపాలన పాటించకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

15 లోపు పంట నమోదు చేయించుకోవాలి

గోనెగండ్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈనెల 15వ తేదీలోపు నమోదు చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత రైతులకు సూచించారు. శుక్రవారం వారు మండలంలోని పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగుచేసిన పంటలను నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి తీసుకోవాలన్నారు. అనంతరం గోనెగండ్లలోని వ్యవసాయ కార్యాలయ ఆవరణంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సాగుచేసిన పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

జగద్గురువు శ్రీకృష్ణుడు

దేవనకొండ: మానవ జీవిత పరమార్థాన్ని తెలియపరిచిన జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్ముడు అని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లెడబుడకల గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ప్రవచనాలు ఆధ్యాత్మికత నింపాయి. శుక్రవారం ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయవాది హోసూరు జానకిమనోహర్, భజన గురువు బోయ కొలుట్లయ్య, బోయ కృష్ణయ్య, వడ్ల శ్రీరాములుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణ పనుల పరిశీలన


నిట్రవట్టిలో సచివాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో నిర్మితమవుతున్న సచివాలయాన్ని పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గూళ్యం సచివాలయాన్ని సందర్శించారు. బిల్లులు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈయన వెంట సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.

చిప్పగిరి: మండల కేంద్రంలో రూ.21 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం ఏఈ భవ్య పరిశీలించారు. భవన నిర్మాణ కొలతలు తీశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. మండలంలోని గుమ్మనూరు, బెల్డోణ, దౌల్తాపురం, నగరడోణ, నేమకల్లు, రామదుర్గం, ఏరూరు, డేగులపాడు తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

పని చేయని ఆర్వో ప్లాంట్లు


పెండేకల్లు రైలే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో పని చేయని నీటి శుద్ధి యంత్రం

తుగ్గలి: విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యంతో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ (నీటి శుద్ధి యంత్రాలు) నిరుపయోగంగా మారాయి. మండలంలోని 17 ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాది క్రితం నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేశారు. పెండేకల్లు రైల్వే జంక్షన్, తుగ్గలి, జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్, రామాపురం, మారెళ్ల, పెండేకల్లు యూపీ, రాతన ఆశ్రమ, పగిడిరాయి, తుగ్గలి, జొన్నగిరి మెయిన్ తదితర పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు పని చేయడం లేదు. వీటిలో పలుచోట్ల ఇంత వరకు ప్లాంట్లను ఏర్పాటు చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో విద్యార్థులకు శుద్ధ జలం అందడం లేదు. సమస్యను యాప్‌లో కంపెనీ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదని ఆయా పాఠశాలల హెచ్ఎంలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు పనిచేసేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

13 ఏళ్ల తర్వాత తెలంగాణకు బస్సు సర్వీసు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చూపిన చొరవ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కృషితో నందవరం మండలం నాగులదిన్నె బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో తెలంగాణ రాష్ట్రంలోని అయిజ, గద్వాలకు 13 ఏళ్ల తర్వాత బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు సర్వీసును డీఎం అమర్నాథ్ ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు నుంచి నాగులదిన్నె మీదుగా అయిజకు బస్సు సర్వీసు ప్రతి రోజు ఉదయం 6.30 గంటలకు బయలుదేరుతుందన్నారు. నాలుగు షటిల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డిపో సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్-3 శాస్త్రవేత్తకు సన్మానం


శాస్త్రవేత్త కురవ శ్రీరాములును సన్మానిస్తున్న తహసీల్దార్ కె.ఆంజనేయులు

ఎమ్మిగనూరురూరల్: చంద్రయాన్-3 ప్రయోగంలో పాలుపంచుకున్న నందవరంకు చెందిన శాస్త్రవేత్త కురవ శ్రీరాములును స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం తహశీల్దార్ కె.ఆంజనేయులు, సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శాస్త్రవేత్త శ్రీరాములు మాట్లాడుతూ.. బెంగుళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నట్లు తెలిపారు. చంద్రయాన్-3 విశేషాలు, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ఎన్నికల డీటీ గురురాజరావు సిబ్బంది ఉన్నారు.

11, 12 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

నందవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 11, 12వ తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జ్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్ మహమ్మద్ హనీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-17 విభాగంలో(బాల, బాలికలు) విద్యార్థులు పోటీల్లో పాల్గొన్న వచ్చన్నారు. 11న ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, షటిల్, యోగ, టెన్నికాయిట్, 12న అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9490485159, 8978596965 నంబర్లను సంప్రదించాలన్నారు.

14, 15 తేదీల్లో ఎంపిక పోటీలు

వెల్దుర్తి: ఈనెల 14, 15 తేదీల్లో స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు గోవర్ధనగిరి జెడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్లు పోటీల ఇన్‌చార్జ్, వెల్దుర్తి బాలికల హైస్కూల్ పీడీ నిర్మలాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో.. పోటీలకు మండలంలోని అన్ని పాఠశాలల క్రీడాకారులు అర్హులుగా పేర్కొన్నారు. అండర్-14, 17 విభాగాలలో 14న బాలురకు, 15న బాలికలకు పోటీలుంటాయని, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, టెన్నికాయిట్ క్రీడాంశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

దేవనకొండ: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఏఓ సురేష్‌బాబు, వీఆర్వో జాకీర్‌హుసేన్ అన్నారు. రెండు రోజులక్రితం దేవనకొండలో కౌలు రైతు నరసప్ప అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం అధికారులు పరామర్శించారు. త్వరలో ప్రభుత్వ ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు. ఏఈఓ జయరాం, రంగన్న, తలారి కౌలుట్ల పాల్గొన్నారు.

గల్లంతైన మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిమ్మయ్య


సరస్వతి(ఫైల్)

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామ సమీపంలో ఉన్న తుంగభద్ర నదిలో గల్లంతైన కురవ సరస్వతి(27) మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. గ్రామంలోని కురవ పరమేశప్ప పొలం సమీపంలో నదిలో సరస్వతి మృతదేహాన్ని గ్రామస్తులు వెలికితీశారు. మృతదేహాన్ని ఎస్ఐ తిమ్మయ్య పరిశీలించారు. అనంతరం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలు కురవ సరస్వతికి భర్త భీమేష్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వలస కూలీ మృత్యువాత


బోయ కార్తీక్ (ఫైల్)

హొళగుంద: సుళువాయి గ్రామానికి చెందిన బోయ కార్తీక్ (17) అనే వలస కూలీ గురువారం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన బోయ తిక్కప్ప, పార్వతి కుమారుడైన కార్తీక్ కొద్ది రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా నందిగామ సమీప పొలాల్లో పత్తి విడుపు పనులు చేసేందుకు వలస వెళ్లాడు. ఆ ప్రాంతంలో జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సహకార బ్యాంకు సేవలు హర్షణీయం


వెల్దుర్తి సహకార సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి: సహకార సంఘాలు లాభాల బాట పట్టడంతో రైతులకు మేలు కలుగుతుందని, రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు అందించడంలో వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్-ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ) ముందుంటుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె శుక్రవారం డీసీసీబీ-డోన్ పరిధిలోని స్థానిక సొసైటీ రూ.24 లక్షలతో చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ (12 రూములు) నిర్మాణానికి సొసైటీ చైర్మన్ కంగాటి వంశీధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జ్ సమీర్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఏసీఎస్‌లు వ్యవసాయ సంబంధిత, వ్యవసాయేతర వ్యాపారాలతో అభివృద్ధి పథంలో నడవాలన్నారు. గత టీడీపీ కాలంలో నష్టాల బాటలో ఉన్న వెల్దుర్తి పీఏసీఎస్‌కు తాను చైర్మన్‌గా, కర్నూలు డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న నాటి నుంచి లాభాల బాట పట్టించడాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం దాదాపు 12వేలకు మించి సభ్యులతో, అభివృద్ధి పథంలో పయనిస్తూ ఇతర సహకార సంఘాలకు ఆదర్శంగా నిలుస్తుండడం గర్వకారణమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, డోన్ డీసీసీబీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్లు కామేశ్వరయ్య, హనుమంతరెడ్డి, వెల్దుర్తి సొసైటీ సీఈఓ రామకృష్ణ, డైరెక్టర్లు గంగాధర్, ఎల్లయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం


జన్మించిన శిశువును చూపుతున్న 108 సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి గ్రామానికి చెందిన కురువ సాధమ్మ అనే నిండు గర్భిణికి 108 సిబ్బంది సుఖ ప్రసవం అయ్యేలా చికిత్స అందించారు. శుక్రవారం తెల్లవారుజామున సాధమ్మ పురిటి నొప్పులతో బాధపడ్తుండగా ఆశ కార్యకర్త షమ వెంటనే 108కు ఫోన్ చేసి సమాచారం అందించారు. హొళగుంద పీహెచ్‌సీకి చెందిన 108 అంబులెన్స్ నెరణికి గ్రామానికి చేరుకుని గర్భిణిని ఆదోని ఎంసీహెచ్ హాస్పిటల్‌కి తరలిస్తుండగా నెరణికి- ముద్దనగేరి గ్రామ మధ్యలో పురిటినొప్పులు తీవ్రమయ్యాయి. ఈఎంటీ బీకె. యల్లయ్య, పైలట్ ఆసిఫ్ అలీ సహకారంతో సాధమ్మకు చికిత్స అందించగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు పేగు మెడకు వేసుకుని రావడంతో ఈఎంటీ యల్లయ్య జాగ్రత్తగా కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో ఆదోని ఎంసీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. సాధమ్మకు ఇది మొదటి కాన్పు కాగా శిశువుతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉన్నారు. సకాలంలో 108 సిబ్బంది చికిత్స నిర్వహించడం పట్ల కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి


ఆగవేళ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

కృష్ణగిరి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాలని జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సిద్ధలింగమూర్తి ఆదేశించారు. మండల పరిధిలోని ఆగవేళి, ఎరుకలచెర్వు గ్రామంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన శుక్రవారం ఎంపీడీఓ విశ్వమోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు వేగంవంతం చేసేలా లబ్ధిదారుల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు సోప్‌పీట్ నిర్మించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎరుకలచెర్వు గ్రామంలో హరిజన బొజ్జమ్మ అనే లబ్ధిదారురాలు తమ ఇంటికి బిల్లు మంజూరు చేయడం లేదని స్పందనలో ఫిర్యాదు చేయగా ఆ ఇంటిని పరిశీలించారు. లబ్ధిదారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ఆధారాలున్నాయని బిల్లుకు సిఫారసు చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. హౌసింగ్ ఈఈ ప్రభాకర్, డీఈ విజయ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ ఉన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన మైనార్టీ నాయకులు


డిప్యూటీ సీఎం అంజాద్ బాషాకు వినతిపత్రం ఇస్తున్న జామియా మసీదు అధ్యక్షులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని జామియా మసీదు అభివృద్ధికి, ముస్లింల శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మసీదు అధ్యక్షుడు ఖాశింబేగ్ తదితరులు డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గోనెగండ్లలోని జామియా మసీదు మర్కస్ అభివృద్ధి కోరకు విన్నవించినట్లు వారు పేర్కొన్నారు. నిధుల మంజూరుపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ ఉన్నారు.

జీవాల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరు రూరల్: గొర్రెలు, మేకల పెంపకందారులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సుబ్రమణ్యాచారి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కాలేజీలో జాతీయ పశుగణన మిషన్ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల పెంపకందారులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గొర్రెల, మేకల యజమానులు జీవాలకు వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. వ్యాధి సోకినట్లు అనిపిస్తే వెంటనే దగ్గరలోని పశువైద్యులకు చూపించాలన్నారు. జీవాలకు ప్రభుత్వం వర్తింపచేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్లు రామసుబ్బారెడ్డి, జానకి, వెటర్నరీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గురువిష్ణు తదితరులు పాల్గొన్నారు.